పక్కాగా.. నల్లాల లెక్క

- ముమ్మరంగా మిషన్ భగీరథ ఇంటింటి సర్వే
- ఇప్పటి వరకు 20వేలకు పైగా ఇళ్ల సర్వే పూర్తి
- వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు



వర్యతండాలో సర్వే చేస్తున్న కార్యదర్శి



పీఏపల్లి మండలంలో సర్వేను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు (ఫైల్)

దేవరకొండ : గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికి నల్లా కననెక్షన్ ఇచ్చి శుద్ధ జలాన్ని అందజేస్తున్నామని మిషన్ భగీరథ విభాగం ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక మిషన్ భగీరథపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పథకం ద్వారా క్షేత్రస్థాయిలో నీరు అందుతుందా లేదా..అన్న వివరాలు తెలుసుకోవడంతో పాటు కేంద్ర నిధులు పొందేందుకు గాను ఇంటింటి సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో సోమవారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ప్రారంభమైంది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న కార్యదర్శులు పంచాయతీల్లో సర్వేచేయడంలో నిమగ్నమయ్యారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని గ్రామపంచాయతీల్లో ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని కొండమల్లేపల్లి, పీఏపల్లి మండలాల్లో మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు సర్వే ప్రక్రియను పరిశీలించారు. దేవరకొండ నియోజకవర్గంలో 90వేల 853 నల్లా కనెక్షన్లు ఉండగా ఇప్పటి వరకు 19వేల456 నల్లాల సర్వే పూర్తయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

వివరాలు ఇలా..

సర్వే నిర్వహించే వారు ప్రతి రోజు నిర్దేశించిన ఇళ్లను సందర్శించాల్సి ఉంటుంది. ఆయా ఇళ్లకు మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలవుతోంది.. ఇంటింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా.. పైప్‌లైన్లు ఎలా ఉన్నాయి? ట్యాంకు నీరు ఏ మేర నల్లాల ద్వారా ఇళ్లకి చేరుతుంది.వాటిని ప్రజలు ఏమేరకు వినియోగిస్తున్నారు.ఒక్కో ఇంటికీ ఎన్ని లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా..అన్న వివరాలతో పాటు ఆధార్ , ఫోన్‌నంబర్, అదే విధంగా ఆ ఇంటి కుటుంబ సభ్యుడి ఫొటో తీసి యాప్‌లో పొందుపరుస్తున్నారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, మహిళా సంఘ సభ్యుల నేతృత్వంలో ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి ఆ ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా, ఉంటే నీరు ఎలా వస్తుంది. ప్రతి రోజు ఎన్ని లీటర్లు సరఫరా అవుతున్నాయి. తదితర అంశాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు కాకుండా ఇంకా ఏవైనా వనరుల ద్వారా నీళ్లు వస్తున్నాయా..వంటి వివరాలు తెలుసుకుంటున్నారు. వీటిని మండల కార్యాలయం, అక్కడి నుండి జిల్లాకు ప్రతి రోజూ పంపిస్తున్నారు. ఇటింటి సర్వే అనంతరం వాస్తవంగా మిషన్ భగీరథ రిజర్వాయర్లు, నీటి పంపులు, ట్యాంకులు, పైప్‌లైన్‌ల వివరాలు సైతం యాప్‌లో పొందుపర్చు తున్నారు.

సమగ్ర సర్వే నిర్వహిస్తున్నాం



మిషన్ భగీరథ పథక లక్ష్యం ఏమేర అమలవుతోంది. కుళాయి నీరు ప్రజలు ఎలా సద్వినియోగించేసుకుంటున్నారు. ఎక్కడైనా సమస్య ఉందా, ఏదైన కాలనీలకు నీరు అందుతుందా లేదా? వంటి పలు అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించడం జరుగుతోంది. ఇదంతా ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు.దీంతో సమగ్ర నివేదిక సిద్ధం కానుంది.

– నగేష్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూస్ డీఈఈ

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బకల్‌వాడి జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం విద్యార్థులకు ఆయన యూనిఫాం, పాఠ్య, నోటుబుక్స్ అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవి ఎంతో మంది నేడు గొప్ప స్థాయిలో ఉన్నారన్నారు. అనంతరం మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించి మరమ్మతులు చేయాలన్నారు. తాగునీటి సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

దేవరకొండ : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్ కావడంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారని, దళారులను నమ్మి మోసపోకుండా సంబంధిత వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం రైతుబంధు నగదును ప్రభుత్వం విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని 200 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలె వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎండీ మైనొద్దీన్, ఉప్పునూతల వెంకటయ్య, ఎన్.కనకాచారి, నూనె రామస్వామి, సుదర్శన్‌రెడ్డి, బొమ్మ అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ శనివారం మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అధిక ఫీజులను వసూలు చేయడంతో పాటు టై, బెల్ట్, యూనిఫాం పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. పాఠశాలల ప్రారంభమైన రెండు, మూడు రోజులు మాత్రమే అయిందన్నారు. విద్యాశాఖ పూర్తిగా పట్టించుకోకపోవడం లేదని ఆర్డీఓకు వి వరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిలకల మురళి యాదవ్, పోలిశెట్టి అజయ్‌కుమార్, గంగాధర్, సిద్దం రాజు, ఉపేందర్, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కృష్ణుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సీతారంపురంలో రుక్మిణి, సత్యభామ సమేతా శ్రీకృష్ణుడి కల్యాణం శనివారం గీతామందిర్‌లో అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఆ ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం బ్రహ్మోత్సవాలకు త్రిదండి చిన్న జీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి పట్టణ పరిసరాల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బండారు కుశలయ్య, చీదేళ్ల వెంకటేశ్వర్లు, వేణు, మట్టయ్య, వెంకటదుర్గ ప్రసాద్, యాదగిరి, శ్రీనివాస్, కష్ణమూర్తి, నారాయణరావు, రామారావు, శివకుమార్, సాంబమూర్తి, లక్ష్మీనారాయణ, రాము, లింగయ్య, అయిల్ శ్రీనివాస్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు అశోక్, అంతయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, లింగయ్య, మల్లయ్య, రాంమ్మూర్తి, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ స్టేషనరీ అందజేత



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసిన క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని తాళ్లగడ్డ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీని వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో క్లబ్ సభ్యులు మొక్కలను నాటారు. అలాగే పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఫ్యాన్లు, కుర్చీలతో పాటు ఆలయంలో పని చేస్తున్న కార్మికులకు క్లబ్ సభ్యులు చీరలను అందజేశారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, సిల్వర్ స్టార్ కరుమూరి కీర్తన, ఇంటర్నేషనల్ పొగ్రాం కో ఆర్డినేటర్ గరిణే అరుణకుమారీ, డిస్ట్రిక్ ఇన్‌చార్జ్ పీఆర్‌ఓ రాయపూడి భవాని, రీజినల్ చైర్‌పర్సన్ వీరవెల్లి పద్మావతి, జోన్ చైర్మన్ కోప్పురావూరి రమాదేవి, రీజినల్ కార్యదర్శి గుంటూరు అనిత, రీజినల్ ఎక్సన్షన్ చైర్మన్ బోనగిరి లావణ్య, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ తిరునగరు పద్మావతి తదితరులున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



నియామకపత్రం అందుకున్న నిరుద్యోగులతో ప్రిన్సిపాల్ ధనుంజయ

మిర్యాలగూడ : గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే విజేత కళాశాల లక్ష్యమని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ అన్నారు. శనివారం పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 25మంది ఇంటర్మీడియట్ విద్యార్హతతో, 16 మంది డిగ్రీ విద్యార్హతతో జాబ్ మేళాలో పాల్గొన్నారని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతో 19 మంది, డిగ్రీ అర్హతతో 14 మంది ఎంపికకాగా నియామకపత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.మధు, పి.స్వామినాయక్, డి.బాలాజీ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రంజిత్ యాదవ్

పెద్దవూర : మండలంలోని తెప్పలమడుగు గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో తరి పెద్ద నాగయ్య, ఐతబోయిన సైదయ్య, యాదాల యాదయ్య, చిన నాగయ్య, ఎర్రయ్య, లక్ష్మయ్య, ఆరూరి సత్యనారాయణ, రామకృష్ణ, కోటేష్, రాంబాబు, కోటేష్, మల్లేష్, శివ, లింగయ్య, శ్రీకాంత్, గణేష్, రమేష్, నాగరాజు, అజయ్, ముత్తయ్య, సుబ్బయ్య, అంతయ్యలతో పాటు పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చలమల్ల వెంకట్‌రెడ్డి, నాయకులు కుంటిగొర్ల రాజశేఖర్, ఆంజనేయులు, ప్రభాకర్, రవి, రమేష్, భీష్మాచారి పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు నడపొద్దు



స్కూల్ బస్సును పరీక్షిస్తున్న ఎంవీఐ వీరస్వామి

మిర్యాలగూడ : ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులను నడిపితే ఆ బస్సులను సీజ్ చేయడంతో పాటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎంవీఐ వీరస్వామి అన్నారు. శనివారం స్థానిక ఆర్టీఏ కార్యాలయంలో స్కూల్ బస్సుల ఫిట్నెస్‌ను ఆయన పరీక్షించి మాట్లాడారు. మిర్యాలగూడ రవాణా శాఖ పరిధిలో 230 స్కూల్ బస్సులు ఉండగా ఇప్పటివరకు 165 బస్సులకు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 65 బస్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందలేదన్నారు. ఫిట్నెస్ లేని బస్సుల్లో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తామన్నారు. స్కూల్ బస్సుకు సంబంధించి అన్ని భాగాలు సక్రమంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా స్కూల్ బస్సులో ఫైర్ సేఫ్టీ సిలిండర్, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలన్నారు. త్రైమాసిక పన్ను చెల్లించాలని, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్‌తోపాటు పొల్యూషన్ సర్టిఫికెట్, పర్మిట్ వంటి అన్ని ధృవపత్రాలు ఉండాలన్నారు. స్కూల్ బస్సు డ్రైవర్ విధిగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బస్సు డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బస్సును 60 కిలో మీటర్ల వేగానికి మించి నడపవద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాళాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో పాఠ్యపుస్తకాల గదికి వేసిన తాళాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం సామాజిక కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు గదిలో నిల్వ చేయగా ఆ గదిని ఈనెల 1న ఎంఈఓ ఆదేశాల మేరకు విద్యాశాఖ సిబ్బంది సీజ్ చేసినట్లు తెలిపారు. ఈనెల 12న విద్యాశాఖ వేసిన సీజ్ మాయం అయిందని, ఆ సీజ్‌ను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సామాజిక కార్యకర్తలు రుషికేశ్వర్‌రాజు, కొండలు, కార్తీక్‌రాజు, మహేశ్‌లు ఉన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని ప్రథం సంస్థ స్టేట్ హెడ్ రాంబాబు, ప్రోగ్రాం హెడ్ సుధాకర్ అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రథం సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిర్యాలగూడ మండలంలోని 8గ్రామాల్లో కథల పుస్తకాల కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, హైస్కూల్ ఇంచార్జీ వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారోజు వెంకటేశ్వర్లు, జిల్లా కో ఆర్డినేటర్ అనసూయ, మండల కో ఆర్డినేటర్ మమత, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపేందర్, రేణుక, అనుజ, తల్లిదండ్రులు ఉన్నారు.

డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



డిప్యూటీ సీఎం భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

దేవరకొండ : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను శనివారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హైదరాబాద్‌లో కలిశారు. భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే బాలునాయక్ పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బాలునాయక్ వెంట కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, నారాయణనాయక్, రాజేశ్‌రెడ్డి, గోవిందు, తదితరులున్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు

కొండమల్లేపల్లి : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తన జన్మదినం సందర్భంగా శనివారం కాంగ్రెస్ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన పాదయాత్ర సందర్భంగా కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామం వద్ద 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా పైలాన్ ఏర్పాటు చేసిన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మంగ్యానాయక్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా గుంత



సాగర్‌రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంత

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని సాగర్‌రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వైపు వెళ్లే దారిలో గుంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగ ఉండే రోడ్డు వెంట ఈ గుంత వాహనాదారులకు ఇబ్బందిగా మారింది. వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా ఆ గుంతలో పడి తీవ్రగా యాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు వెంట ఉన్న గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ మిర్యాలగూడ డిపో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ హడహక్ నూతన కమిటీని శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెల్ఫేర్ హడహక్ కమిటీ అసోసియేషన్ కన్వీనర్లుగా కెఎల్ నాయక్, కడియం రమేష్, అనిమళ్ల నర్సింహ, డీవీ రత్నం, ఏడీపీ ఆర్, రాగ్యానాయక్, కార్గో ఇన్‌చార్జ్ పరింగి నాగేశ్వర్‌రావు, అధ్యక్షుడిగా డి.బాల, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పి. రోషయ్య, ఉపాధ్యక్షులుగా డి.పాండు, మేళ్ల వెంకటేశ్వర్లు, డి.అచ్చాలి, కార్యదర్శిగా డి. భాగ్యరాజ్, సహాయ కార్యదర్శిగా మేకల వెంకన్న, డి. బాలునాయక్, తివాని, ఆర్ జామ్‌మేర్సీ, టి. లింగయ్య, గణేష్, కోశాధికారిగా పుట్ట వెంకన్న, ప్రచార కార్యదర్శిగా ఏ. అనితలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వారికి అభినందనలు తెలిపారు.

నేడు ఎరుకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ రూరల్: ఎరుకల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ నిమ్మల వెంకన్న కోరారు. శనివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించనున్న సమావేశంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన ఐదుగురు చొప్పున విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. ఎరుకల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కమిటీ నాయకులు కృష్ణయ్య, కోకన్వీనర్లు మొగిలి విజయశేఖర్, సుల్తాన్ సోమయ్య, సుల్తాన్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు నిమ్మచెట్టు భిక్షమయ్య, కోనేటి వెంకటయ్య, రాజబాబు, రుద్రాక్ష భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయాలి

దేవరకొండ : పదోన్నతులు, బదిలీల్లో ఎస్టీటీ ఉపాధ్యాయులకు తగిన న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని పడమటిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం సాయంత్రం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శిరందాసు రామదాసు మాట్లాడుతూ గతంలో ప్రకటించిన విధంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాబాయి, జ్యోతి, శ్రీదేవి, సరిత, సంధ్య, మౌనిక, శశికుమార్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధం కావాలి

నల్లగొండ టౌన్ : సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధం కావాలని రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ సూచించారు. శనివారం రామగిరిలోని ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ వసతి గృహంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. తాను కూడా వసతి గృహంలో చదువుకుని ఐఏఎస్‌గా ఎంపికైన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో సివిల్ సర్వీస్‌కు చదువుకుని హాజరైతే విజయం ఖాయమన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం

హుజూర్‌నగర్ : దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. పెద్దపల్లిలో బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికపై అత్యాచారం, హత్య ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. మహిళలకు రోజురోజుకూ రక్షణ కరువు అవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దేవరం సుజాత, నాయకురాళ్లు ఎస్‌కే.రేష్మ, ఎస్‌కే.మీరా, ఇందిరాల సంధ్య, జడ వెంకటమ్మ, జడ లక్ష్మి, షేక్ మీరాబీ, కుర్ర వీరమ్మ, మునగ మంగమ్మ, పుల్లమ్మ, సోమగాని తిరుపతమ్మ, అమరబోయిన వీరమ్మ, రాపర్తి మంగమ్మ, కస్తాల కనకమ్మ, కోటేశ్వరమ్మ, వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

పాలకవీడు : మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే పాలకవీడు మండలంలో కొనసాగుతోంది. శనివారం గ్రామాల్లో ఇంటింటి సర్వేను ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ దయాకర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి నల్లా బిగింపు, నీటి సరఫరా, నల్లా ఉండి నీళ్లు రాకపోవడం, నల్లాలు బిగించకపోవడం తదితర వివరాలను ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశావర్కరు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిందితులను కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ టౌన్ : వసంత మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మియాపూర్‌లో దుకాణం దగ్గరకు వెళ్లిన 12ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో పాటు హత్య చేసి ఆనావాళ్లు కూడా కనబడకుండా దాహనం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన గిరిజనులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు మక్లానాయక్, శంకర్‌నాయక్, హరినాయక్, కోట్యానాయక్, మెతిలాల్‌నాయక్, జమ్లానాయక్, గోపి, సైదానాయక్ తదితరులున్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

నిడమనూరు : కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం బీసీల కులగణన చేపట్టాలని నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి పిల్లి రాజు శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. గతంలో రాష్ట్రం మొత్తం సకల జనుల సమ్మెను ఒక్క రోజులో చేయగా ప్రస్తుత ప్రభుత్వానికి బీసీల గణన చేయడానికి సమయం పడుతుందని ప్రభుత్వం అనడం తప్పించుకోవాలని సూచించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

మిర్యాలగూడ టౌన్ : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు డి.శివాని, ఎస్‌కె అలినా ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎస్.విజయకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి ఏటా రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందజేశారు. ఆ విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజితమ్మ, పార్వతి, నాగలత, ప్రమీల, సుకన్య, గోపారపు రాజు ఉన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నిడమనూరు : మండలంలోని జంగాలగూడెంకు చెందిన మోతె సాలమ్మకు శనివారం మేరెడ్డి మురళిధర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సాలమ్మ టీబీతో ఇబ్బంది పడుతుందని తెలిపారు. పరీక్షల కోసం వచ్చిన వారు పేద రోగుల కోసం ఏర్పాటు చేసిన విరాళాలపెట్టిలో వేసిన నగదుతో కలిపి తమ వంతుగా రూ.10వేల నగదు ఇతర నిత్యావసర ఆహార సామగ్రిని అందజేశారు. మేరెడ్డి ప్రవీణ్ రెడ్డి, స్వాతి దంపతులు సంధ్య డయాగ్నొస్టిక్ సెంటర్‌లో బాధితురాలికి అందజేశారు.

వికాస సమితి మండల అధ్యక్షుడిగా జనార్దన్



నియామక పత్రం అందుకుంటున్న జనార్దన్

కొండమల్లేపల్లి : మండల సమాచార హక్కు వికాస సమితి మండల అధ్యక్షుడిగా గుమ్మడవెల్లి జనార్దన్ నియమితులయ్యారు. ఈ మేరకు నల్లగొండలో నిర్వహించారు. సమావేశంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్రమద కృష్ణారెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

నీలగిరి వేదిక నమూనా పరిశీలన

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్ పక్కన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న నీలగిరి వేదిక నమూనాను శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద ఆడిటోరియమని, 2వేల మంది సీటింగ్ కెపాసిటీతో నిర్మించే నీలగిరి వేదిక డిజైన్లను సంబంధిత ఏజెన్సీ ప్రతినిధి చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డికి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌కు చూపించారు. గత ప్రభుత్వ హయాంలో నీలగిరి కళాభారతి అని నామకరణం చేయగా దానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నీలగిరి వేదిక అని పేరు మార్చారు. గత డిజైన్లలో కొన్నింటికి మార్పులు, చేర్పులు చేసి తుది డిజైన్‌ను రూపొందించారు. సమావేశంలో కౌన్సిలర్లు కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్, నాయకులు బషీరుద్దీన్, సాయి గపాల్గొన్నారు.